అశుద్ధాలు అంటుకుంటయి. రాజమ్మ విసుక్కోదు, అసహ్యించుకోదు. తనకు మామూలైనట్టు పనిలో మునిగిపోతుంది.

చీదరించుకుంటే ఎవరికి నష్టం..? తిండికి దొరక్కుంటే ఆకలి ఎవరికి..?

మనిషి రోగాలతో చచ్చినా ఫరవాలేదు, ఆకలితో చావకూడదు కదా..? అట్లా ఎవరూ కోరుకోరు కూడా. ఏదోవిధంగా బతికెయ్యాలి. బతకడం కోసం అన్నీ భరించాలి. మూత్రమైనా, మలమైనా, అది మనిషిదైనా జంతువుదైనా చేతుల్తో ముట్టుకోవాలి. అంటుకోనివ్వాలి. తనకలాంటి హీనస్థితి కల్పించిన దేవుణ్ని రాజమ్మ ఎప్పుడూ తిట్టుకోదు. అసలు తిట్టుకునేందుకో మెచ్చుకునేందుకో ఆమెకు తీరిక ఉండదు.

అప్పుడప్పుడే తెలతెల్లవారుతోంది.. పాత ఏడాదికి వీడ్కోలు చెపుతూ రాత్రంతా విందులూ వినోదాల్లో మునిగి తేలిన నగరం, కొత్త ఏడాదిలో తొలిరోజు కొంచెం ఆలస్యంగా మేలుకుంటోంది. రాజమ్మకు ఒకింత సంతోషంగా ఉంది. ఆ దినం ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, అట్టడబ్బాలు కొంచెం ఎక్కువే దొరుకుతున్నయి. ఆమె వయసుకూ, ఎత్తుకూ ఏమాత్రం పొంతన లేనట్టు మోసుకొస్తున్న పెద్దసంచీ క్రమేపీ నిండిపోతోంది.

బరువెక్కిన సంచీతో నడవడం కష్టంగా ఉంది. అయినా భారంగా అడుగులేస్తూ వీధులు కలియ తిరుగుతోంది.

అట్లా నడిచి ఆ ప్రాంతంలోని అతిపెద్ద చౌరస్తాకు చేరుకుంది. నాలుగు దిక్కులనుంచి విశాలమైన రోడ్లు అక్కడ ఒకే దేహానికి అతికించినట్టు కలుస్తున్నయి. ఒక పక్కన సర్వీసు రోడ్డులోకి తిరిగిందామె. వరుసగా దుకాణాలు, షాపింగ్ మాల్స్. షాపుల ముందు మెట్లపక్కన ఉన్న చెత్తడబ్బాలు వెతుకుతూ వెళుతున్నది. ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో చేయిపెట్టి కెలుకుతూ వెతికింది. నాలుగైదు ఖాళీ వాటర్ బాటిళ్లు దొరికినయి. మరోచోట కొన్ని అట్టడబ్బాలు, డిస్పోజ్ టీ గ్లాసులు, పారేసిన మద్యం సీసాలు కనిపిస్తే సంచీలో వేసుకుంది.

అప్పటికి పూర్తిగా తెల్లారిపోయింది..

నగరం మెల్లగా తూర్పు దిక్కుకు తిరుగుతోంది. రాజమ్మ నిశ్శబ్దంగా తనపని చేసుకుపోతోంది. ఓచోట లెక్కలేనన్ని అంతస్తులతో ఒక భారీ అపార్టుమెంటు నిర్మాణం జరుగుతోంది. తలెత్తిచూస్తే అంతెత్తున ఇంకా నిర్మాణం పూర్తికాని ఫ్లాట్స్ కింద నుంచి పిచ్చుకగూళ్ల మాదిరి కనిపిస్తున్నయి. భారీ యంత్రాలు, క్రేన్ల సాయంతో రాత్రీ పగలూ ఏకధాటిగా కడుతున్నారు. మేస్త్రీలు, వర్కర్లు నిర్విరామంగా పనిచేస్తున్నారు.

సరిగ్గా దానికి ఎదురుగా ఉన్న టీకొట్టు దగ్గరకొచ్చింది రాజమ్మ. భుజం మీది సంచి ఓ పక్కన దింపేసి అటు చూస్తూ నిలబడింది. ఆ పిల్లకి చాయ్ తాగితే బాగుంటదనిపించింది. కానీ డబ్బుల్లేవు. టీలు చేసి అందిస్తున్న వ్యక్తి కేసి చూసింది. అతడూ ఆమెని చూశాడు.

రాజమ్మ కదలక మెదలక తదేకంగా చూస్తుంటే కొద్దిసేపటికి అతనే అడిగాడు..

''చాయ్ తాగుతవా పోరీ..?''

ముందు వద్దన్నట్టు తల అడ్డం ఊపింది. తర్వాత తడబడుతూ చిన్నగా అంది..

''నా దగ్గర పైసల్లేవన్నా!''

అతడేమనుకున్నాడో మరేమీ ఆడక్కుండా చిన్న ప్లాస్టిక్ గ్లాసులో టీ పోసి అందించాడు. రాజమ్మ సంతోషంగా తీసుకుంది. అలసిన ముఖంలో వెలుగు. కృతజ్ఞతగా చూసింది. చాయ్ తాగుతూ ఓ మూల ఒదిగి నిలబడింది.




టీకొట్టతను పక్కన కష్టమర్లతో చెపుతున్నాడు.

''ఎంత పెద్ద అపార్టుమెంటు కడ్తున్నరో చూసిన్రా? ఒక ఊరంత ఉన్నది. దీంట్ల ఎన్ని కుటుంబాలుంటయో!?''

''అవునవును.. కోట్ల రూపాయల ముచ్చట''

''దాన్ని కట్టిస్తున్న ఓనర్ నాకు తెలుసు''

''తెలుసా.. అంత గొప్పోడు నీకెట్ల ఎరుక?''

''అతనిది మా ఊరే. ఒకప్పుడు బాగ పేదోడు. చదువుకోలేదు. ఆవారాగా తిరిగిండు. తండ్రి చిన్నప్పుడే సచ్చిపోయిండు. కూలినాలి చేసుకుంట తల్లే అతణ్ని పెంచింది. ఆమె కూడ పోయినంక సిటీకొచ్చి పడ్డడు. ఇక్కడికొచ్చి పది పన్నెండేండ్లు కావొచ్చు. ఇంత తక్కువ టైములో ఎక్కడున్నోడు ఎక్కడికో పెరిగి పోయిండు''

''ఇంత మార్పు ఎట్ల జరిగింది'' ఎవరో అడిగారు.

''కొంతకాలం అక్కడక్కడ చిన్నచిన్న పనులు చేసుకుంట ఉన్నడు. తర్వాత ఒక పేరున్న బిల్డరు తానికి పనిలోకి పోయిండు. అక్కడ నమ్మకంగా ఉండి ఈ రంగంలో కిటుకులన్నీ నేర్చుకున్నడు. తర్వాత సొంతంగ బిల్డరు అవతారమెత్తిండు. తంతెలెక్కినట్టు పైపైకి పోయిండు. గంతనే..! సూస్తుండంగనే సీన్ మొత్తం మారిపోయింది. తర్వాత అతడు సిటీల ఎన్నో అపార్టుమెంట్లు, భవంతులు కట్టిండు. ఇంకోపక్క కాంట్రాక్టరు పనులు మొదలుపెట్టి చాలాచోట్ల రోడ్లేసిండు, వంతెన్లు కట్టిచ్చిండు. అట్లా పల్లెటూరు నుంచి పొట్ట చేతవట్టుకొని ఎలుకపిల్ల లెక్క వొచ్చిన మనిషి ఏనుగంత అయిండు. పదేండ్ల కింద పేదవాళ్లల్ల ఒకడిగ ఉండేటోడు. ఇప్పుడుసూడు యాడున్నడో!?''

''అంతే అన్నా..! అదృష్టం చిత్రమైంది. మనలాంటోళ్ల మీద ముసురు లెక్క రాలిపడి ఇంకొందరి మీద కుంభవృష్టి తీర్గ కురుస్తది''

''అట్లెందుకు అనుకోవాలె..? మనకంటే నికృష్టంగ ఎందరు లేరు? అదృష్టం ముఖం కూడా చూడకుండ బతుకంతా దరిద్రంలో మగ్గుతున్నోళ్లు చాలామంది ఉన్నరు''

''ఏం జేస్తం? ఎవడి రాత వాడిదే. దేవుడు జన్మ ఇచ్చినప్పుడు చచ్చేదాక బతికితీరాలె. అది మనిషి తీర్గనో, కుక్క తీర్గనో''

రాజమ్మ అందరి మాటలు విన్నది. తర్వాత అక్కణ్నుంచి మెల్లగా కదిలింది. చెత్తలో గాలింపు సాగిస్తూనే అదృష్టాన్ని గురించి తన చిన్న బుర్రతో తలపోసింది.

ఈ లోకంలో ఎంతమంది చెత్తవాళ్లు ధనికులయ్యే అదృష్టాన్ని పొంది ఉంటరు? పెంటకుప్పల్లో పనికిరాని వస్తువులు ఏరుకునే వాళ్లకు అదృష్టం ఏ రూపంలో వొచ్చి తలుపు కొడుతుంది? బహుశా పెంటకుప్పల నుంచే పుట్టుకరావాలి. చెత్తలోనే ఏదైనా విలువైన వస్తువు దొరికితే ఎంత బాగుంటది?

ఆమెకి చెత్తలో ఎప్పుడో అరుదుగా ఒకటీ ఆరా కొంచెం విలువైన వస్తువులు దొరుకుతుంటయి. కానీ, అవేవీ బతుకుల్ని సమూలంగా మార్చివేసేవి కావు. అట్లా మార్చగల విలువైనవి ఎప్పటికైనా దొరుకుతాయన్న ఆశ ఉంటుంది. తనకే కాదు, చెత్త ఏరుకుని బతుకుతున్న అందర్లోనూ ఉంటుందని ఆమె అనుకుంటది.

ఇప్పటివరకైతే అలాంటి పెన్నిధి ఏదీ రాజమ్మకు తగల్లేదు. తననింకా అదృష్టం వరించలేదని భావిస్తుంది.

ఎవరు చెప్పగలరు..? అటువంటి ఒకరోజు.. ఒక